పేట ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు కరువు

- అప్‌గ్రేడ్ అయినా తీరు మారని వైనం
- ఇబ్బందులు పడుతున్న రోగులు

జగ్గయ్యపేట అర్బన్: అప్ గ్రేడ్ అయినా తీరు మారకపోవడంతో పేట ప్రభుత్వాస్పత్రిలో ఇబ్బందులు తప్పడంలేదు. 30 పడకల ఆసుపత్రిగా ఉన్న పేట ప్రభుత్వాస్పత్రి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుంచి వైద్య విధాన పరిషత్‌గా అప్‌గ్రేడ్ అయి ఆరు ఏళ్ల దాటినప్పటికీ సౌకర్యాలు మెరుగుపడటం లేదు. నాడు చాలీ చాలని ఇరుకు గదులతో కునారిల్లుతున్న రోగులకు గత వైఎస్సార్ సీపీ పాలనలో నాడు–నేడు పథకం ద్వారా నాబార్డు నిధులు రూ. 3 కోట్లతో విశాలమైన భవన నిర్మాణంతో వివిధ విభాగాలకు గదుల ఏర్పాటు చేశారు. ఆధునిక సాంకేత పరిజ్ఞానంతో కూడిన వైద్య సౌకర్యాలు, వైద్య సిబ్బందికి కొరత లేకుండా అన్ని విభాగాలకు పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించేందుకు కృషి చేశారు. అలాగే 30 పడకల నుంచి 50 పడకలకు పెంపుతో పాటు రూ. 12 లక్షలతో ఆస్పత్రి ముందు స్వాగత ద్వారంతో పాటు వాటర్ ఫౌంటెయిన్ సుందరీకరణ ఏర్పాటుతో సామాజిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న పేట ప్రభుత్వాస్పత్రిని కార్పొరేట్ స్థాయి ఆస్పత్రుల వరుసలో నిలబెట్టారు. కానీ నేడు కూటమి పాలనలో ఆస్పత్రి పరిస్థితి మళ్లీ యథాస్థితికి చేరుకుంటోంది.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

జగ్గయ్యపేట పట్టణంలో సుమారు 60 వేల మంది జనాభా ఉన్నారు. అలాగే పేట పట్టణానికి ఆనుకుని, నియోజకవర్గం పరిధిలో 30 కిమీ మేర 65వ నెంబర్ జాతీయ రహదారి కలిగి ఉంది. దీంతో నిత్యం జాతీయ రహదారిపై జరిగే రోడ్డు ప్రమాదాలతో క్షతగాత్రులను మొట్టమొదట పేటలోని ప్రభుత్వాస్పత్రికే తీసుకురావాల్సి రావడంతో ఆస్పత్రిపై తీవ్ర ఒత్తిడి పెరుగుతూ వస్తోంది. ప్రతిరోజు 200 నుంచి 300 మంది అవుట్ పేషంట్లు, 10 నుంచి 15 వరకు మెడికో లీగల్ కేసులు(ఎంఎల్‌సీ), తరచూ పోస్టుమార్టం కేసులు వస్తుంటాయి. ఇంత ప్రధాన్యత ఉన్న ఈ ఆస్పత్రి గతంలో ముగ్గురు, నలుగురు మాత్రమే వైద్యులు ఉండగా, వైఎస్సార్ సీపీ పాలనలో కొత్తగా మరొక ఎనిమిది మంది వైద్యులను నియమించారు. దీంతో 11 మంది వైద్యులు ఉండేవారు. అయితే నేడు కూటమి పాలనలో ప్రస్తుతం ఏడు మంది మాత్రమే వైద్యులు పని చేస్తున్నారు. ప్రస్తుతం ఒక ఆర్థోపెడీషియన్, ఇద్దరు జనరల్, ఒక అప్తాల్‌మాలజీ, ఒక గైనకాలజీ, ఒక పీడియాట్రిక్, ఒక మత్తు డాక్టరు ఉన్నారు. ఇంకా ఒక జనరల్ సర్జరీ, ఒక జనరల్ మెడిసిన్, ఒక గైనకాలజిస్ట్, ఒక ఈఎన్‌టీ కావాల్సి ఉంది.


జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రి

వచ్చిన డాక్టర్లు వచ్చినట్లే వెళ్లిపోతున్నారు

ప్రభుత్వాస్పత్రిలో ప్రధానంగా దంత వైద్యుడు లేక సుమారు ఏడాదిన్నర కావస్తుంది. దీంతో దంత సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేక ప్రైవేటు దంత వైద్యుల వద్దకు వెళితే వేల రూపాయిలు దోపిడీ చేస్తున్నారని రోగులు వాపోతున్నారు. గత రెండేళ్ల క్రితం పనిచేసిన శ్రీధర్ అనే దంత వైద్యుడు బదిలీ అయి వెళ్లిపోయినప్పటి నుంచి ఇప్పటి వరకు దంత వైద్యులు ఎవరూ నిలబడలేకపోతున్నారు. ఈ మధ్య కాలంలో మాధవీలత అనే డెంటిస్ట్ వచ్చి కొంతకాలం పనిచేసి డిప్యుటేషన్‌పై వెళ్లిపోయింది. ఆ తర్వాత కొంతకాలం విరామం అనంతరం ఈ ఏడాది జనవరి 10న మేర్తాన్ ఫ్లోరెన్స్ అనే డెంటిస్ట్ వచ్చింది. ఆమె కూడా వారంలోనే డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు గత నెల 18న డిప్యుటేషన్‌పై వెళ్లిపోయింది.

దంత వైద్యులు లేరు



జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి దంత వైద్యుడు పోస్టు కలిసి రావడంలేదు. ఎప్పుడు చూసినా ఆ పోస్టులో ఉన్న వారు సెలవుపై వెళ్లడమో, డిప్యుటేషన్‌పై వెళ్లడమో చేస్తున్నారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వేలకు వేలు ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుంది. ఉన్నతాధికారులు స్పందించి డెంటిస్ట్‌తోపాటు ఇతర వైద్యులను ఏర్పాటు చేయాలి.

లంకపల్లి రవిప్రసాద్, ఒకటవ వార్డు

ఉన్నతాధికారులకు తెలియజేశాం



గత నెల 10వ తేదీన డెంటిస్ట్ పోస్టు భర్తీ అయ్యింది. కానీ మళ్లీ అదే నెల 18న కమిషనర్ ఆదేశాల మేరకు డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లారు. డాక్టర్ల కొరత గురించి ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఈ నెలాఖరుకు నియామకం జరగవచ్చు అని తెలియజేశారు.

అల్ల హరీష్, సూపరింటెండెంట్, ప్రభుత్వాస్పత్రి

తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష

నందిగామ టౌన్(నందిగామ రూరల్): మండలంలోని దాములూరు కూడలి గ్రామంలో వేంచేసి యున్న సంగమేశ్వర స్వామివారి ఆలయంలో ఈ నెల 25వ తేది నుంచి నాలుగు రోజులపాటు జరిగే మహాశివరాత్రి తిరునాళ్ల మహోత్సవాలపై అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం తహసీల్దార్ నూతక్కి సురేష్‌బాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి మహోత్సవాలు విజయవంతం చేయాలని తెలిపారు. ఆలయం వద్ద బారికేడ్‌లు, క్యూలైన్‌ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని చెప్పారు. వాహనాల పార్కింగ్, పిండ ప్రదానాలు చేసుకునే ఘాట్‌ల వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.


తిరునాళ్ల ఏర్పాట్లపై సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ సురేష్‌బాబు

సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు గాదెల వెంకట రామారావు, చెరుకూరు హైమారావు, ఈఓ నరసింహామూర్తి, ఉత్సవ కమిటీ సభ్యుడు గింజుపల్లి శ్రీనివాసరావు, డీసీ వైస్‌చైర్మన్ సాంబశివరావు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

స.హ చట్టంపై అవగాహన అవసరం


సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగిస్తున్న సంచాలకులు


కంచికచర్లలో రైతులకు అవగాహన కలిగిస్తున్న ఏడీఏ శ్రీనివాస్

నందిగామ రూరల్: ప్రతి ఒక్క రైతు సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరావు, మోనిషాలు పేర్కొన్నారు. మండలంలోని కంచల, ఐతవరం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మంగళవారం సమాచార హక్కు చట్టం–2005పై మండల స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా అర్జీ పెట్టుకుంటే సంబంధిత శాఖాధికారులు 30 రోజుల్లోగా లిఖితపూర్వకంగా సమాచారం అందిస్తారని పేర్కొన్నారు. ఈ చట్టం ద్వారా దేశ సార్వభౌమత్వానికి భంగం కలగని సమాచారం మాత్రమే పొందే వీలుంటుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఖాశీం, ఉద్యాన శాఖాధికారి నీలిమ, వీఏఏలు ప్రవీణ్, సైదారావు, రైతులు పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల: కంచికచర్ల రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ అధికారులు సమాచార హక్కు చట్టంపై మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్ననందిగామ వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ ఐకే శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు అధికారుల నుంచి కావల్సిన సమాచారాన్ని అర్జీ రూపంలో కోరవచ్చని తెలిపారు. అర్జీలను ప్రతి శాఖలో పౌర సమాచార అధికారికి ఇచ్చినట్లయితే సదరు సమాచారాన్ని 30 రోజుల్లోగా పొందవచ్చని అన్నారు. ఆ సమాచారాన్ని అధికారులు ఇచ్చిన గడువులోగా పొందలేకపోయినట్లయితే అధీకృత అధికారి నుంచి సమాచారం కోరవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే విజయకుమార్, వీఏఏలు హనీస్, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

గుంత తీశారు.. పూడ్చటం మరిచారు

జగ్గయ్యపేట: పట్టణంలోని కోదాడ రోడ్డులో మోర్ సూపర్ మార్కెట్ వద్ద మున్సిపల్ అధికారులు గుంత తీసి పూడ్చటం మరిచారు. పక్షం రోజుల క్రితం మెయిన్ రోడ్డులో ప్రధాన తాగునీటి పైప్‌లైన్ మరమ్మతుల నిమిత్తం ఐదడుగుల మేర గొయ్యి తీశారు. అయితే తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి అయినప్పటికీ గుంతను పూడ్చకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారి కావడంతో తరచూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో పాటు గుంత సమీపంలోనే 33కేవీ విద్యుత్ లైన్ స్తంభం పునాది కూడా పూర్తిగా పోయి ఇటుకల ఆధారంపైనే నిలిచింది. మున్సిపల్ అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావును వివరణ కోరగా తాగునీటి పైప్ లైన్ ట్రయల్ రన్ జరుగుతుందని రెండు రోజుల్లో పూడ్చుతామని చెప్పారు.


పట్టణంలోని మోర్ సూపర్‌మార్కెట్ వద్ద తీసిన గొయ్యి

నిరుపయోగంగా చెత్త సేకరణ రిక్షాలు


గ్రామ సచివాలయంలో నిరుపయోగంగా ఉన్న చెత్త సేకరణ రిక్షాలు


కార్యాలయంలో మరోపక్క మూలనపడి ఉన్న ఎలక్ట్రిక్ రిక్షా

కె.అగ్రహారం(జగ్గయ్యపేట): గ్రామంలో చెత్త సేకరణకు వినియోగించే రిక్షాలు, ఎలక్ట్రికల్ రిక్షా గత కొన్ని నెలలుగా సచివాలయంలో పడి ఉన్నాయి. చెత్త సేకరణకు వినియోగించే వాహనాలు నిరుపయోగంగా ఉన్నా అధికారులు కనీసం స్పందించడం లేదు. జిల్లా అధికారులు ప్రతి నెలా మూడవ శనివారం పారిశుద్ధ్య నిర్మూలనకు చర్యలు అంటూ పిలుపునిస్తున్నా స్థానిక అధికారులు మాత్రం అందుకనుగుణంగా పని చేయడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త సేకరణ రిక్షాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

కమనీయం.. తిరుపతమ్మ కల్యాణం

- వైభవంగా వేడుకలు
- దీక్షాస్వాములతో ఎరుపెక్కిన ఆలయం


అమ్మవారికి పట్టువస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్ దంపతులు


రాజగోపురం వద్ద దీక్షాస్వాములు


కల్యాణానికి హాజరైన అశేష జనం


అంగరంగ వైభవంగా అమ్మవారి కల్యాణం

పెనుగంచిప్రోలు: రంగురంగుల విద్యుత్ దీపాలు, వివిధ పత్ర, పుష్పాలతో సుందరంగా అలంకరించిన కల్యాణ వేదికపై శ్రీతిరుపతమ్మ, గోపయ్య స్వామి కల్యాణ వేడుక వైభవంగా సాగింది. రమణీయంగా సాగిన ఈ మహోత్సవాన్ని భక్తులు కనులారా తిలకించి పులకించారు. శ్రీతిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఉదయం 6.08 గంటలకు ఆలయ ఈఓ బి.హెచ్.వీఎస్.ఎన్.కిషోర్‌కుమార్, ఈఈ ఎల్.రమ ఆధ్వర్యంలో అఖండజ్యోతి స్థాపన, ప్రత్యేక పూజలు అనంతరం దీక్షా స్వాముల తిరుముడి సమర్పణతో ఉత్సవాలు మొదలయ్యాయి. శ్రీస్వయంభూ శంభులింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ప్రధానార్చకుడు మర్రెబోయిన గోపిబాబు, మాలాధారణ ప్రధాన గురుస్వాములు ఎం.సూరిబాబు, ప్రసాద్‌స్వామి తిరుముడి కట్టారు. తిరుముడి కట్టుకున్న స్వాములు అమ్మ భజనలతో, శరణుఘోషతో అమ్మవారిని దర్శించుకొని తిరుముడి సమర్పించి హోమగుండంలో తిరుముడిలోని ముద్దర టెంకాయలోని నెయ్యిని సమర్పించారు. దీక్షాస్వాములకు మునేరు అవతల అమ్మవారి ఆలయానికి చెందిన మామిడితోటలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఈఓ, ఈఈ ప్రారంభించారు. తెల్లవారు జామునుంచి భక్తులు మునేరులో స్నానమాచరించి పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థాన ఆవరణలో పోలీస్, రెవిన్యూ, ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి భక్తులకు సేవలు అందిస్తున్నారు. దీక్షా స్వాములకు పలు స్వచ్ఛంద సంస్థల వారు అల్పాహారం, ఆలయం తరఫున స్వాములకు నిరంతరాయంగా వాటర్ పంపిణీ చేశారు. గ్రామంలో పంచాయతీ సిబ్బంది, ఆలయం వద్ద ఆలయ సిబ్బంది పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. రాజగోపురం వద్ద తిరుముడి సమర్పణకు భక్తులు బారులు తీరి అమ్మ దర్శనానికి ఉరక లేశారు. దీక్షాస్వాములు వేలాదిగా తరలి రావటంతో ఆలయ పరిసరాలతో పాటు గ్రామం అంతా ఎరుపెక్కింది.

అమ్మవారికి ముత్యాల తలంబ్రాలు సమర్పణ

గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారికి మంగళవారం కల్యాణ ముత్యాల తలంబ్రాలు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆలయ అర్చకుల చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు వారిని అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.సూరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా కృష్ణామిల్క్ యూనియన్ వజ్రోత్సవాలు

కేతవీరునిపాడు(నందిగామ రూరల్): కృష్ణామిల్క్ యూనియన్ ఏర్పడిన 60 వసంతాల్లో ఎంతో మంది రైతులకు అండగా నిలవడమే కాకుండా దినదినాభివృద్ధి చెందిందని డైరెక్టర్ నెలకుదిటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని కేతవీరునిపాడు గ్రామంలోని పాల కేంద్రంలో కృష్ణామిల్క్ యూనియన్ వజ్రోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సూపర్‌వైజర్ పోపూరి శ్రీనివాసరావు, పాడి రైతులు పాల్గొన్నారు.

దీక్షాస్వాములకు అల్పాహారం



మక్కపేట(వత్సవాయి): శ్రీ గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి దీక్షాస్వాములకు మంగళవారం అల్పాహారాన్ని అందజేశారు. గ్రామస్తులు కొందరు చందాలు వేసుకుని ప్రతి ఏటా అమ్మవారి కల్యాణ మహోత్సవానికి వచ్చే దీక్షాస్వాములు, భక్తులకు గత 20 ఏళ్లగా అల్పాహారాన్ని అందిస్తున్నారు. సుమారు నాలుగువేల మందికి వరకు అల్పాహారాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో కొండేటి హనుమంతరావు, కొండబోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీపీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా యండ్రాతి



వత్సవాయి: డెమెక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని మక్కపేట గ్రామానికి చెందిన యండ్రాతి మల్లేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీను నియామక పత్రాన్ని మల్లేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనుకు కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలో యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడులు



నందిగామ రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి దీక్షాస్వాముల ఇరుముడి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని సీతారామాంజనేయ స్వామివారి ఆలయంలో గురుస్వాములు దీక్షాస్వాములకు ఇరుముడులు కట్టారు. అనంతరం తిరుపతమ్మ నామస్మరణతో పెనుగంచిప్రోలు గ్రామంలోని అమ్మవారి సన్నిధికి నడుచుకుంటూ బయలుదేరి వెళ్లారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన ఏఐసీటీఈ, ఏటీఏఎల్ శిక్షణ

కంచికచర్ల: స్థానిక మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన ఏఐసీటీఈ, ఏటీఏఎల్ శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీ వంశీ కిరణ్ మంగళవారం స్థానిక విలేకరులకు వివరాలు వెల్లడించారు. అధ్యాపకులకు ఎక్స్‌ప్లోరింగ్ అగ్మెంటెడ్ అండ్ వర్చువల్ రియాలిటి ఇన్ ఇమ్మెర్సివ్ అండ్ ఇంటరాక్టివ్ సైబర్ ఫిజికల్ సిస్టం ఫర్ ఇండస్ట్రీ 4–ఓ అనే అంశంపై వారం రోజుల పాటు శిక్షణ అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారని కోఆర్డినేటర్ జీ సాయి చైతన్యకుమార్ తెలిపారు.

నయనానందకరంగా రథోత్సవం

నందిగామ టౌన్(నందిగామ రూరల్): శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వర స్వామివారి రథోత్సవాన్ని మంగళవారం రాత్రి నయనానందకరంగా నిర్వహించారు. రథోత్సవం ప్రారంభోత్సవానికి ముందు అన్నకుంబాభిషేకం, బలిహరణ, విశేషాది పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. పుష్పాలంకృత విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా అలంకరించిన ప్రత్యేక రథంపై స్వామి, అమ్మవారిని ఉంచి మంగళ వాయిద్యాలు, వీరభద్ర ఖడ్గమాల, కోలాట నృత్య ప్రదర్శన, బాణాసంచా వెలుగులతో భక్త జన సందోహం నడుమ పారువేట మండపం వరకు వీనుల విందుగా రథోత్సవాన్ని జరిపించారు. రథోత్సవంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏసీపీ తిలక్ పర్యవేక్షణలో సీఐ వైవీఎల్ నాయుడు, ఎస్ఐ అభిమన్యులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. కాగా రథోత్సవం సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. రథోత్సవంలో కోలాట, నృత్యప్రదర్శన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ఈఓ గంగాధర్, అనువంశిక ధర్మకర్త వాసిరెడ్డి మురళీ రాఘవకుమార్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కమిషనర్ రమణబాబు, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


భక్తజన సందోహం నడుమ రామలింగేశ్వర స్వామివారి రథోత్సవం


రామలింగేశ్వరస్వామి, శుకశ్యామలాంబ అమ్మవార్లు


కల్యాణోత్సవంలో మహిళలు, భక్తులు

కనులపండువగా కల్యాణోత్సవం

పలు రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలంకృతమైన ప్రత్యేక మండపంలో వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాలు.. భక్తుల హర్షధ్వానాల నడుమ రామలింగేశ్వరస్వామి, శుకశ్యామలాంబ అమ్మవారి కల్యాణాన్ని మాఘశుద్ధ చతుర్థి శుభదినాన సోమవారం అర్ధరాత్రి కనుల పండువగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు అమ్మవారిని పార్వతీదేవిగా అలంకరించి స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేసి ఎదురుకోలోత్సవం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపానికి తీసుకువచ్చి వేదోక్తంగా అమ్మ, స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం అమ్మ, స్వామివారిని పుర వీధుల్లో ఊరేగించారు. కాగా కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో కొప్పు గురుస్వామి శిష్య బృందం లడ్డూ ప్రసాదం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు ముదిగొండ బాలశశాంక మౌళి ఆరాధ్య, ఉప ప్రధానార్చకుడు దండిబొట్ల బాలకృష్ణ శాస్త్రి, అర్చకులు యడవల్లి సీతారామ ప్రసాద్, పవన్‌కుమార్, దుర్భాకుల కామేశ్వర ఘనాపాటి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి పెద్ద తిరునాళ్ల, కల్యాణ మహోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మొత్తం 1,200 మంది వరకు భక్తులకు ఉచిత పరీక్షలు చేయడంతోపాటు పలు రకాల వ్యాధులకు సంబంధించి మందులు అందజేయడం జరిగిందని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు వై. రత్నప్రియదర్శిని, సుకన్య, కె. కృష్ణమోహన్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.